సాక్షి
తిరుపతి
శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



రుయాలో నిర్లక్ష్యంపై కలెక్టర్ కన్నెర్ర

రుయా ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ వెంకటేశ్వర్ మండిపడ్డారు. ఆయన ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ చేశారు. - 8లో



దౌర్జన్యాలను ఎదిరిస్తాం

టీడీపీ దౌర్జన్యాలను ఎదిరిస్తామని, పాత బస్టాండ్ వ్యాపారుల జోలికొస్తే ఊరుకోబోమని భూమన కరుణాకరరెడ్డి అన్నారు. - 8లో



టీడీపీ నేతల దాడి..

టీడీపీ నేతల దాడిలో జీరకుప్పం పంచాయతీ సర్పంచ్ సెల్వి భర్త మునస్వామి తీవ్రంగా గాయపడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. టీటీడీ అధికారుల సమాచారం మేరకు స్వామి వారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం 60,203 మంది శ్రీవారిని దర్శించుకోగా, 21,793 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు లభించినట్లు అధికారులు తెలిపారు.

ఎస్వీ జూలో స్నేక్ రిస్క్యూ ట్రైనింగ్

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజుల పాటు అటవీ శాఖ, చెన్నై క్రోకోడైల్ బ్యాంక్, సంఘమిత్ర అనిమల్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్నేక్ రిస్క్యూ ట్రైనింగ్ నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి స్నేక్ ట్రైనర్స్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఉత్తమ డ్రైవర్లకు సత్కారం

తిరుపతి అర్బన్: ప్రమాదాలకు దూరంగా ఉంటూ ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ డ్రైవర్లకు శనివారం తిరుపతిలోని డీపీటీఓ కార్యాలయంలో సన్మానంతోపాటు ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. జిల్లాలోని 11 డిపోలకు సంబంధించి ఆయా డిపోల పరిధిలో సేవలు అందించిన నేపథ్యంలో ఒక్కో డిపో నుంచి ముగ్గురు డ్రైవర్లను ఎంపిక చేశారు. అంతేకాకుండా జిల్లా స్థాయిలో సేవలు అందించిన మరో ముగ్గురు డ్రైవర్లను ఎంపిక చేశారు. మొత్తంగా 36 మంది డ్రైవర్లకు ప్రశంసాపత్రాలను ఇవ్వడానికి జిల్లా ఆర్టీసీ పెద్దలు రంగం సిద్ధం చేశారు.

ముగిసిన జాతీయ సదస్సు



అతిథులతో వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ సావేరీ సెమినార్ హాల్ వేదికగా పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్ అండ్ ఫైలింగ్ విధానాలపై గత ఐదు రోజులుగా జరిగిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎన్ఐ–ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప, ఎన్ఆర్‌డీసీ హెడ్ డాక్టర్ బిజాయ్ కుమార్‌షా, ఐఐటీ చెన్నైకి చెందిన డాక్టర్ దారా అజయ్ పాల్గొని పరిశోధనలకు, ఆవిష్కరణలకు పేటెంట్ హక్కుల ప్రాధాన్యతపై ప్రసంగించారు. అనంతరం అతిథులను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజినిని మర్యాద పూర్వకంగా కలసి సదస్సుపై చర్చించారు. సదస్సు ఆర్గనైజర్ ప్రొఫెసర్ డీఎం మమత, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ప్రాథమిక'ంగా ప్రసవయాతన



- పెళ్లకూరు పంచాయతీకి చెందిన గాయత్రి మూడు నెలలకు క్రితం ప్రసవం కోసం ఆ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లింది. సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో ఆమెను తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకువచ్చారు. మార్గం మధ్యలో భరించలేని పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. అరుపులు కేకల మధ్య ఎలాగోలా ఆస్పత్రికి తీసుకువచ్చి సకాలంలో వైద్యం చేయించడంతో తల్లీబిడ్డ క్షేమంగా బయటపడ్డారు.
- శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన సుమతికి పురిటి నొప్పులు రావడంతో స్థానికంగా ఉన్న ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. డెలివరీ చేసేందుకు అక్కడ సౌకర్యాలు లేకపోవడం, అందుకు అవసరమైన మందులు లేకపోవడంతో బిడ్డ అడ్డం తిరిగిందనే సాకుతో పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు తీసుకువెళ్లారు. డబ్బు కట్టలేని పరిస్థితిలో ఉన్న ఆ కుటుంబ సభ్యులకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవం శాపంగా మారింది. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే సిజేరియన్ కు రూ.55 వేలు అప్పు తెచ్చి కట్టాల్సిన పరిస్థితి వచ్చింది.
- వారం క్రితం పాపానాయుడుపేట పీహెచ్‌సీ పరిధిలోని ఓ మహిళకు పురిటి నొప్పులొచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు పాపానాయుడుపేట పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి సిబ్బంది సవాలక్ష ప్రశ్నలు వేసి.. తీరిగ్గా మీరు తిరుపతి వెళ్లాలంటూ సెలవిచ్చారు. చేసేది లేక ఆమెను తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చాలా ఆలస్యమైందని, మేజర్ సర్జరీ చేయాలని అక్కడి డాక్టర్లు సూచించారు. ఆపై సర్జరీ చేసి బిడ్డను బయటకు తీశారు. నార్మల్ డెలివరీ కావాల్సిన సమయంలో నిర్లక్ష్యం చేయడంతోనే ఇలా జరిగిందని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు.

పడకేసిన 'ప్రసూతి'

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొరవడిన వైద్యసేవలు
- పీహెచ్‌సీల్లో తగ్గిన ప్రసవాలు
- గత ప్రభుత్వ హయాంలో స్థానికంగానే ప్రసవాలు
- ప్రస్తుతం పట్టణాలకు పరుగులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అసౌకర్యాలకు నిలయాలు.. ప్రసవం కోసం ఆ కేంద్రాలకు వెళితే డెలివరీ జరుగుతుందో లేదోన్న ప్రశ్న తలెత్తుతోంది. అందుబాటులో లేని వైద్యులు..మందుల కొరత..నిర్వీర్యమైన ల్యాబ్‌లు.. వసతులలేమి.. తదితర కారణాలు గర్భిణుల పాలిట శాపంగా మారాయి. ఒక వేళ వెళ్లినా గర్భిణులను భయపెట్టి ఇతర ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు. దీంతో ప్రసవానికి ప్రైవేటు ఆస్పత్రులే దిక్కుగా మారుతున్నాయి. ప్రసవ లక్ష్యాన్ని అధిగమించే క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఫలితంగా ప్రాథమిక కేంద్రాల్లో గర్భిణులకు ప్రసవయాతన తప్పడం లేదు.

తిరుపతి తుడా: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై గర్భిణుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. దీంతో పీహెచ్‌సీల్లో ప్రసవాలు చేయించుకోవడానికి సాహసించడం లేదు. వైద్యులు అందుబాటులో లేకపోవడం, వసతులు కొరవడడం, ల్యాబ్‌లు దయనీయస్థితికి చేరడం, మందుల కొరత వేధిస్తుండడంతో ప్రస్తుతం గర్భిణులు స్థానికంగా డెలివరీ చేసుకునేందుకు ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో గర్భిణులు పురిటి నొప్పులు వస్తే పట్టణాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

గతంలో పీహెచ్‌సీల్లోనే అధిక ప్రసవాలు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థానికంగానే డెలివరీలు చేయించేందుకు పటిష్టమైన వ్యవస్థను తీసుకువచ్చింది. వారంలో రెండు రోజులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణుల వైద్యం కోసం గైనకాలజిస్టులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా డాక్టర్లే కాకుండా స్టాఫ్ నర్సులకు ప్రసవాలు చేయడంపై ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. అలాగే గర్భిణులకు అవసరమైన అన్ని రకాల మందుల అందుబాటులో ఉంచింది. దీంతో తిరుపతి జిల్లాలోని పీహెచ్‌సీల్లో అత్యధిక ప్రసవాలు జరిగాయి.

నేడు గ్రామీణ ఆరోగ్యం నిర్వీర్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పీహెచ్‌సీలను పూర్తిగా విస్మరించారు. ఆధునిక ల్యాబ్‌లు ఉన్నప్పటికీ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రి సరఫరా నిలిపివేసింది. మందులు అందుబాటులో లేవు. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన ఉచిత మందులు ఊసే లేదు. దీంతో పీహెచ్‌సీలపై గర్భిణులకు నమ్మకం పోయింది. ఈ క్రమంలో గర్భిణులు పట్టణాల్లోని ఆస్పత్రుల వైపు చూస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం



గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించే దిశగా చర్యలు చేపట్టాం. మందుల కొరతను తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. మందుల కొనుగోళ్లకు అనుమతులు లభించాయి. ప్రసవం చేసేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులు పీహెచ్‌సీల్లో సుఖప్రసవం చేసుకోవచ్చు. అందుకు అవసరమైన యంత్రాంగం అందుబాటులో ఉంది. పీహెచ్‌సీల్లో డెలివరీల సంఖ్య తగ్గడంపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ బాలకృష్ణనాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తిరుపతి

పీహెచ్‌సీల్లో తగ్గుతున్న ప్రసవాలు



తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ ప్రసూతి, ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, మెటర్నటీ ఆస్పత్రుల్లో రోజువారీ 300 నుంచి 500 వరకు డెలివరీ కేసులు నమోదవుతున్నాయి. గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లోనూ గత ఐదేళ్లలో అత్యధికంగా గర్భిణులు ప్రసవాలు మొగ్గుచూపినవారు నేడు ఆ వైపునకు వెళ్లడంలేదు. ఈ క్రమంలోని గడిచిన ఆరు నెలలుగా పీహెచ్‌సీల్లో ప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

నెలలో ఒక డెలివరీ కూడా చేయని పీహెచ్‌సీలెన్నో..



తిరుపతి జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఇందులో 58 కేంద్రాల్లో డెలివరీలు చేస్తున్నారు. రెండేళ్ల మందు ప్రతి ఆరోగ్య కేంద్రంలో నెలకు సుమారు 25 డెలివరీలు చేసేవారు. ప్రస్తుతం నెలలో ఒక డెలివరీ కూడా చేయని గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు 35కుపైగా నమోదయ్యాయి. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు తిరుపతి జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో మొత్తం 583 ప్రసవాలు జరిగాయి. 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు కేవలం 447 డెలివరీలు మాత్రమే చేసినట్లు నమోదయ్యాయి. ఈ సంఖ్య ఏ స్థాయిలో తగ్గిందన్న విషయం స్పష్టమవుతోంది.

జిల్లా సమాచారం

గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మొత్తం:	ఇందులో ప్రసవానికి అనుకూలమైనవి:
60	58

పట్టణ ఆరోగ్య కేంద్రాలు: 26

డెలివరీ కేసుల వివరాలు

2023		2024	
సెప్టెంబరులో	61	సెప్టెంబరులో	55
అక్టోబర్:	55	అక్టోబర్:	35
నవంబర్	52	నవంబర్	40
డిసెంబర్	52	డిసెంబర్	34

2025 జనవరిలో: 33

డెలివరీ కేసుల వివరాలు

2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మొత్తం **583**

2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు: **447**



వైద్యసేవలపై సడలిన నమ్మకం

నేడు ప్రభుత్వ వైద్యసేవలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది. గతంలో ప్రజా వైద్యం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవల కోసం పీహెచ్‌సీల్లో 167 రకాల మందులు అందుబాటులో ఉంచింది. రక్త, మూత్ర పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలను సమకూర్చింది. ఈసీజీ, థైరాయిడ్ వంటి పరీక్షలను సైతం గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది. మెడికల్ ఆఫీసర్లతోపాటు ప్రతిరోజు ఏదో ఒక స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టింది. స్థానికంగా ప్రసవాలు చేసేందుకు స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చి విజయవంతంగా డెలివరీలను చేసే స్థాయికి గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ప్రజా ఆరోగ్యాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. వసతులు కల్పన, పర్యవేక్షణ, మందుల సరఫరా, ల్యాబ్‌లకు అవసరమైన సామగ్రిని సమకూర్చడంలో పూర్తిగా విఫలమైంది. దీంతో గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలకు వెళ్లేందుకు గర్భిణులు సాహసించడం లేదు. అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను చూసి, గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణ వైద్యంపై మొగ్గు చూపుతున్నారు.

చెవిరెడ్డి పేరు చెరపడానికి
రూ.70 లక్షలా?

- అభివృద్ధి చేయడం చేతగాక రంగులు వేస్తారా?
- గ్రామాల్లో స్వచ్ఛందంగా అడ్డుకుంటున్న మహిళలు
- ప్రజాధనం దుర్వినియోగంపై నిలదీత
- హైకోర్టు, లోకాయుక్తను ఆశ్రయిస్తున్న మోహిత్‌రెడ్డి
- హైకోర్టుకు వెళ్తుండడంపై అధికారుల్లో గుబులు
- అర్ధంతరంగా వర్క్ ఆర్డర్ రద్దు చేసుకున్న కాంట్రాక్టర్



చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో పసుపు రంగులు వేసిన సిమెంటు బెంచీలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'వామ్మో.. ఒక్క చెవిరెడ్డి పేరు చెరపడానికి రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నారా..? అభివృద్ధి చేయడం చేతగాక గతంలో జరిగిన అభివృద్ధి పనులకు రంగులు వేస్తారా..? ప్రజాధనాన్ని రంగులు వేయడానికి దుర్వినియోగం చేస్తారా..? ఎవరు ఇచ్చారు మీకు ఆ హక్కు..? పసుపు రంగులు వేసి ప్రశాంతంగా ఉన్న పచ్చని పల్లెల్లో చిచ్చు రేపుతారా..? ఇదేనా మీ పరిపాలన..? చంద్రగిరి చరిత్రలో ఎప్పుడూ లేని ఒక కొత్త సంప్రదాయాన్ని తెచ్చిపెట్టి, పేర్లు చెరపడానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తారా..? అంటూ పల్లెల్లోకి వచ్చే అధికారులు, పోలీసులను నిలదీస్తున్నారు. రంగులతో చెవిరెడ్డి పేరు చెరపగలరేమో కానీ ఆయన చేసిన అభివృద్ధిని ప్రజల గుండెల్లో నుంచి చెరపగలరా..? అని ప్రశ్నిస్తున్నారు. ఎవరో చేసిన అభివృద్ధి పనుల ఆనవాళ్లు లేకుండా చేయడం కాదు, చేతనైతే అంతకన్నా బాగా అభివృద్ధి చేసి చూపాలంటున్నారు. కాదు ఇలాగే చేస్తామంటే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.'

చెరిపేస్తారా అభివృద్ధి ఆనవాళ్లు?

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో 20 వేలకు పైగా సిమెంటు బెంచీలను తుడా నిధులతో అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తయారు చేయించి ప్రతి పంచాయతీలోని ప్రతి వీధిలో ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు తీరిక సమయంలో ఆ బెంచీలపై కూర్చుని ఆప్యాయంగా మాట్లాడుకునే అవకాశం కల్పించారు. ఆ తర్వాత చంద్రగిరి ఎమ్మెల్యేగా వచ్చిన పులివర్తి నాని ఆ సిమెంటు బెంచీలపై చెవిరెడ్డి పేరును చెరిపేయాలని అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. అలా రంగులు వేయడానికి రూల్స్ లేవని వారు చేతులెత్తడంతో చివరకు తన నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల ఎంపీడీఓలను రంగంలోకి దించారు. ఏకంగా రూ.70 లక్షలతో చెవిరెడ్డి పేరు చెరిపేందుకు రంగులు వేయించే పనులు ప్రారంభించారు.

చెరగని సంతకాలు!

చంద్రగిరి ఎమ్మెల్యేలుగా గతంలో సేవ చేసిన నారా చంద్రబాబునాయుడు, మేడసాని వెంకటరామనాయుడు, ఎన్.ఆర్ జయదేవనాయుడు, నారా రామ్మూర్తినాయుడు, గల్లా అరుణకుమారి చేసిన అభివృద్ధి పనులపై ముద్రించిన వారి పేర్లను ఆ తర్వాత ఎమ్మెల్యేగా వచ్చిన చెవిరెడ్డి ఎక్కడా చెరపలేదు. చిత్తూరు ఎంపీలుగా పనిచేసిన ఎస్.రామక్రిష్ణారెడ్డి, ఎస్.శివప్రసాద్, డీకే.ఆదికేశవులునాయుడు చంద్రగిరి ప్రజల సౌకర్యార్థం తమ పార్లమెంటు నిధులతో చేసిన అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసుకున్న వారి పేర్లనూ ఎక్కడా తొలగించలేదు. నేటికీ ఆ శిలాఫలకాలన్నీ అలాగే కనిపిస్తూనే ఉన్నాయి. ప్రజలతో పాటు అన్ని పార్టీల వారు వాటిని నేటికీ చూస్తూనే ఉన్నారు.

ఇప్పుడు ఎందుకు రంగులు వేస్తున్నారో?

గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనుల బోర్డులపై పేర్లు మూసివేయాలంటే ఎన్నికల కోడ్ అమల్లోకి రావాలి. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు జరగడం లేదు. ఎన్నికల కోడ్ అమల్లో లేదు. ఒక వేళ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా సరే ఎన్నికలవగానే తీసేలా ముసుగు వేయాలే తప్ప ఇలా శాశ్వతంగా కనిపించకుండా రంగులు వేయడానికి వీల్లేదు. మరి ఇప్పుడు ఎందుకు పసుపు రంగులు వేస్తున్నారని ప్రశ్నిస్తే అధికారుల నుంచి సమాధానం రావడం లేదు.

అధికారుల గుండెల్లో గుబులు

తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి లోకాయుక్త, హైకోర్టుల్లో పిటీషన్లు దాఖలు చేస్తుండడంతో రంగుల వ్యవహారంలో బాధ్యులైన అధికారుల గుండెల్లో గుబులు పట్టుకుంది. కోర్టు నుంచి ఏ రకమైన ఉత్తర్వులు వస్తాయో, అవి ఎక్కడ తమ ప్రమోషన్లు, సర్వీసు రికార్డులకు మచ్చ తెచ్చి పెడతాయోనన్న భయం పట్టుకుంది. ఇప్పటికే ఆయా మండలాల్లో ఎంపీపీలు రంగులు వేయడానికి మీకు ఎవరు అనుమతిచ్చారో ఆర్డర్ కాపీలు చూపించాలని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తుండడం, ఆ వ్యవహారం కోర్టుకు చేరుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళన అధికారుల్లో మొదలైంది. ఇదిలావుండగా రంగులు వేయడానికి ఒప్పందం చేసుకున్న కాంట్రాక్టర్ తన సిబ్బందితో గ్రామాల్లోకి వెళుతుండగా అక్కడ ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత, శాపనార్థాలు, కోర్టు కేసుల వ్యవహారంతో భయపడి ఈ పని తాను చేయలేనని తన వర్క్ ఆర్డర్‌ను అర్ధంతరంగా రద్దు చేసుకోవడం గమనార్హం.

వామ్మో.. రూ.70 లక్షలా?

కేవలం సిమెంటు బెంచీలపై ఉన్న చెవిరెడ్డి పేరు చెరపడానికి రూ.70 లక్షలు ప్రభుత్వ ధనం ఖర్చు చేస్తున్నారంటేనే తెలుస్తోంది ఆయన ఎన్ని వందల కోట్లతో అక్కడ అభివృద్ధి పనులను చేశారోనని. ఒక్క పేరు చెరపడానికి రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నారని తెలిసిన వారంతా 'వామ్మో..70 లక్షలా'అని నోరెళ్లబెట్టే పరిస్థితి. ప్రభుత్వాధికారులు బరితెగించి అంతలా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుండడం పై ప్రజల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనుల ఆనవాళ్లు చెరిపేస్తే చెరిగి పోతాయా..? అంటూ చర్చించుకుంటున్నారు. కొయ్యతో తయారు చేసినట్టుగా చూడటానికి ముచ్చట కలగించే సిమెంటు బెంచీలపై పిచ్చి పిచ్చిగా రంగులు వేయించడం కూడా ప్రజల్లో చిరాకు తెప్పిస్తోంది.



బండార్లపల్లిలో పసుపు రంగు వేస్తున్న పెయింటర్

లోకాయుక్త, హైకోర్టులలో పిటీషన్ దాఖలు

గ్రామ పంచాయతీల తీర్మానాలు లేకుండా ప్రభుత్వ ఆస్తులకు పసుపు రంగులు వేయడం, ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడంపై తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హైకోర్టుతో పాటు లోకాయుక్తను ఆశ్రయించి వేర్వేరుగా పిటీషన్లు దాఖలు చేస్తున్నారు. రంగుల కోసం ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోర్టును అభ్యర్థించనున్నారు. అదే తరహాలో ప్రతి పంచాయతీ నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు కోర్టుల్లో పిటీషన్లు దాఖలు చేయడానికి సంసిద్ధమవుతున్నారు.

ఆదర్శప్రాయుడు సంజీవయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్



పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి అర్బన్: అభివృద్ధికి ఆదర్శ ప్రాయుడు మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కొనియాడారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంజీవయ్య 104 జయంతిని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, పలువురు అధికారులు హాజరయ్యారు. సంజీవయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

తిరుపతి నగరంలోని ఎస్పీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలను కొనియాడారు. పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ లేదు



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్

తిరుపతి అర్బన్: జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదని, చికెన్, గుడ్లు నిరభ్యంతరంగా తినవచ్చని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. తిరుపతిలోని తన కార్యాలయంలో శుక్రవారం రామచంద్రాపురం, వడమాలపేట, చిన్నగొట్టిగల్లు, పుత్తూరు, రేణిగుంట, తిరుపతి రూరల్ మండాల పరిధిలో పౌల్ట్రీఫారాలు నడుపుతున్న 18 మంది రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో తమ ఉద్యోగులు 85 మంది బృందాలు పనిచేస్తున్నారని చెప్పారు. నిత్యం బర్డ్ ఫ్లూపై నిఘా పెట్టామని వెల్లడించారు. జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని స్పష్టం చేశారు. కోళ్ల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఎలాంటి వ్యాధులు సంక్రమించలేదని తెలిపారు. అయినా పౌల్ట్రీఫారం రైతులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మామిడి దిగుబడి ఎలా ఉంది?

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని ఉద్యాన పంటలను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం పరిశీలించారు. చిన్నగొట్టిగల్లు మండలం, భాకరాపేటలో గోకులం షెడ్లు, ఉపాధి నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, చిన్నగొట్టిగల్లులో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మల్చింగ్ విధానంతో సాగుచేసిన పంటలు, మామిడి తోటలు, ఆధునిక పద్ధతులతో సాగుచేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. అక్కడి రైతులు, సంబంధిత అధికారులతో మాట్లాడారు. మామిడి దిగుమతులపై ఆరాతీశారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.



మల్చింగ్ షీట్ వేసి సాగు చేసిన టమాట పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

బండి ఆపరా మేము పోలీస్

– బెదిరించి బంగారం దోపిడీ

భాకరాపేట : ఏయే బండి ఆపరా మేము పోలీస్ అంటూ బంగారం దొచుకెళ్లిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. బాధితులు కథనం మేరకు.. చిన్నగొట్టిగల్లు సమీపంలోని యండపల్లెవారిపల్లె ఫ్లైఓవర్ సమీపంలో ద్విచక్ర వాహనంలో వస్తున్న రొంపిచెర్ల మండలం బొమ్మయిగారిపల్లె పంచాయతీ గెర్లపల్లెకు చెందిన సుబ్రమణ్యం తన భార్య భారతితో కలసి చిన్నగొట్టిగల్లు వస్తుండగా ఏ బండి ఆపరా మేము పోలీస్ అని వాహనాన్ని ఆపారు. దీంతో ఆయన బండి ఆపి చెప్పండి సార్ అన్నారు. రోడ్డుపై బంగారు వేసుకుని వెళుతున్నారు దొంగలు బంగారు తీసి జేబులో పెట్టుకోమని భార్య మెడలో ఉన్న బొట్టు చైన్, ఉంగరం తీసి పేపరులో పెట్టి ద్విచక్ర వాహనం ట్యాంక్ కవర్‌లో పెట్టుకోమని చెబుతూ వారు 35 గ్రాములు బంగారాన్ని ట్యాంక్ కవర్‌లో పెట్టుకుంటుండగా బంగారాన్ని తీసుకుని ఉడాయించారు. ఈ విషయమై బాధితులు భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఎర్రకూలీకి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో తమిళనాడు, విల్లుపురం జిల్లా చిన్న సేలం తాలూకా, కండిగల్లుకు చెందిన పి. జయపాల్‌కు ఐదేళ్లు జైలుశిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2016 డిసెంబర్ 20వ తేదీ తిరుపతి ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ సిబ్బంది పనబాకం సెక్షన్, తిరుపతి రేంజ్, ముంగిలిపట్టు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఐదుగురు ఎర్రచందనం దుంగలను నరికి తరలిస్తుండగా ఫారెస్ట్ సిబ్బందిని చూసి నలుగురు దుంగలను పడేసి పరారయ్యారు. అయితే ఫారెస్ట్ సిబ్బంది నిందితుడు జయపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జయపాల్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కోటేశ్వర్ రెడ్డి వాదించారు.

దౌర్జన్యాలను ఎదిరిస్తాం

- చిరువ్యాపారుల జోలికి వస్తే సహించం
- చిత్తూరు పాత బస్టాండు వ్యాపారులదే
- చిత్తూరులో చిరు వ్యాపారులతో కలిసి వైఎస్సార్‌సీపీ నిరసన
- కూటమి నేతలపై నిప్పులు చెరిగిన భూమన, ఎంసీ విజయానందరెడ్డి



విజయానందరెడ్డితో కలిసి మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

చిత్తూరు అర్బన్ : 'ఛార్టెడ్ ఫ్లైట్ (అద్దె విమానాల్లో)లలో విహరించే వాళ్లకు పేదల కష్టం తెలియదు. చిత్తూరులో ఎమ్మెల్యే చేష్టలకు ఇదే ప్రత్యక్ష సాక్ష్యం. 56 ఏళ్లకు పైగా పాత బస్టాండ్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఎలా బయటకు పొమ్మంటారు.? వైఎస్సార్‌సీపీ అభివృద్ధిని అడ్డుకోదు.. కూటమి నేతల దౌర్జన్యాలను అడ్డుకుంటుంది. కచ్చితంగా ప్రశ్నిస్తుంది.. ప్రజల గొంతుక అవుతుంది. చిత్తూరు పాత బస్టాండు వ్యాపారుల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తేలేదు.' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, చిత్తూరు సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు నగర బొడ్డున ఉన్న పాత బస్టాండులో మూడు దశాబ్దాల కిందటే మార్కెట్ ధరను చెల్లించి స్థలాలకు పట్టాలు పొందారని, ఇప్పుడు వ్యాపారులను దౌర్జన్యంగా బయటకు పంపించి, బస్టాండును కబ్జా చేసే కుట్ర జరుగుతోందన్నారు. పాత బస్టాండు వ్యాపారులపై కూటమి నేతలు, కార్పొరేషన అధికారుల దౌర్జన్యాలను నిరసిస్తూ శుక్రవారం విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా, భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. వందల మంది వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసి నిరసన చేపట్టారు.

ధనికులకు బస్టాండ్ అప్పగించే కుట్ర

కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని వంచించిందన్నారు. ధనికులకు కొమ్ముకాసిన చంద్రబాబు , పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు. చిత్తూరులో చిరు వ్యాపారులను సర్వనాశనం చేసి, ధనికులకు బస్టాండు అప్పగించడమే సంపద సృష్టించడమా..? అని నిలదీశారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వారి వరకు దేశంలో ఎక్కడా లేని విధంగా గత ఐదేళ్లలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల కోసమే రూ.3.28 లక్షల కోట్లు వెచ్చించారన్నారు. చిత్తూరు బస్టాండు విషయం మాజీ సీఎం జగన్ దృష్టిలో కూడా ఉందని, అవసరమైతే ఆయన దీనిపై పోరాటం చేస్తారన్నారు. అధికారులు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు

దేశ అధ్యక్షులే ఎలాన్ మస్క్ అపాయింట్ కోసం వేచి చూస్తుంటే, ఆయనతో మాట్లాడి ఇక్కడ పెట్టుబడులు పెట్టిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆందోళన కార్యక్రమంలో పూతలపట్టు సమన్వయకర్త డా.సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, పార్టీ నేతలు శ్రీధర్, ప్రకాష్, జయపాల్, గాయత్రీదేవి, మధు తదితరులు పాల్గొన్నారు.

పేదల రక్తం తాగుతున్నారు..

విజయానందరెడ్డి మాట్లాడుతూ.. 'నేను మార్కెట్‌కు రూ.35 లక్షలు ఎగ్గొట్టానని రాశారు. అయిదేళ్లలో రూ.4 కోట్లకు పైగా గేటు చెల్లించి, ఏ ఒక్క వ్యాపారి నుంచి రూపాయి తీసుకోకుండా ఉచితంగా సేవ చేశాను. కానీ ఇప్పుడు ఏం జరుగుతా ఉంది.? చిత్తూరులో గేటు పేరిట కూటమి నేతలు పేదల రక్తాన్ని పీల్చేస్తున్నారు. అధికారులు ఏం చేస్తున్నారు..? అంటూ అసహనం వ్యక్తం చేశారు.

ఆటోడ్రైవర్ హత్యకేసులో నిందితుడి అరెస్టు

సత్యవేడు: మండలంలోని ఓబులరాజుకండ్రిగకు చెందిన ఆటోడ్రైవర్ మృతికి సంబంధించి నమోదైన హత్యకేసులో రెండో నిందితుడు భాస్కర్‌రాజు(63)ను అరెస్టు చేసినట్లు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరు నుంచి ఎరువుల సంచులు తీసుకుని ఓబుల రాజుకండ్రిగకు తీసుకెళ్లడానికి అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఆటోను జగదీష్ పిలిచి బాడుగు మాట్లాడుకుని మరో ఆటోలో వెళ్లడంపై తలెత్తిన వివాదం చివరకు లక్ష్మయ్యపై దాడికి పాల్పడి, కులంపేరుతో దూషించారు. తిరుపతిలో చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి చెందాడు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 3వ తేదీన తొలుత ఎస్సీ ఎస్టీ కేసుగా నమోదు చేశారు. తదనంతరం ఆటో డ్రైవర్ మృతి చెందడంతో హత్యకేసుగా మార్చారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సూచనల మేరకు సీఐ మురళి, ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. రెండు రోజుల క్రితం జగదీష్ రాజును అరెస్టు చేశారు. శుక్రవారం రెండో నిందితుడు భాస్కర్ రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

టీడీపీ నేతల దాడిలో సర్పంచ్ భర్తకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ భర్త మునస్వామి

నగరి : మండలంలోని బీరకుప్పం పంచాయతీ కావేటిపురం వద్ద టీడీపీ నేతలు దాడి చేయడంతో సర్పంచ్ సెల్వి భర్త మునస్వామి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తనపై దాడికి గల కారణాలను సర్పంచ్ భర్త మునస్వామి కథనం మేరకు.. కావేటిపురం లెక్కదాఖలాలో సర్వే నంబర్ 8లోని 7.88 ఎకరాల స్థలం పేరడంగల్‌లో కుంట పొరంబోకుగా చూపుతోందని అడంగల్‌లో ఎ.అనంతనరసింహం పేరిట చూపుతున్నా నోషనల్ ఖాతాలో ఉందన్నారు. ఈ స్థలాన్ని తాము కొనుగోలు చేశామంటూ నగరి పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు జేసీబీతో చదును చేయడం ప్రారంభించారన్నారు. ఆ స్థలం కుంట పొరంబోకని దానిని ఎలా కొంటారు, చదును చేస్తారని వెళ్లిన వారిని ప్రశ్నిస్తే తాము అనంతనరసింహం అనేవారి వద్ద కొనుగోలు చేశామని చదును చేస్తాం.. నీవెవరు అడ్డుకోవడానికి అని బెదిరించారన్నారు. అయితే ఈ స్థలం వాస్తవంగా కుంట పొరంబోకు అని పేరడంగల్‌లో వాటి వివరాలు ఉన్నాయని, ఈ స్థలాన్ని పంచాయతీకి వాడుకోవాలని గతంలో తాను కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించామన్నారు. స్పందన, రెవెన్యూ సదస్సుల్లోను అర్జీలు ఇచ్చానన్నారు. ఈ విషయాన్నే చదును చేసేవారికి తెలియపరిచి పనులను ఆపాలని కోరగా వారు తనపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నానన్నారు. ఈ విషయమై తహసీల్దార్ వివరణ కోరగా కుంట పొరంబోకుగా ఉంటే ఎవరూ ఆక్రమించడానికి లేదని, స్థలం కొన్నవారు చలానా కట్టి రికార్డులు సమర్పిస్తే తామే సర్వేయర్‌ను పంపి కొలతలు వేయిస్తామన్నారు. ఈ విషయమై స్థానిక వీఆర్వో, సర్వేయర్లను కూడా హెచ్చరించడం జరిగిందన్నారు.

రుయాలో నిర్లక్ష్యంపై కలెక్టర్ కన్నెర్ర



రుయాలో ఆకస్మిక తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ వెంకటేశ్వర్ కన్నెర చేశారు. శుక్రవారం ఆయన రుయా హాస్పిటల్‌లోని పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీసి, మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా రుయా ఆస్పత్రిలోని పలు విభాగాలు పనిచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, ఫ్యాన్లు, ఏసీలు, మరుగుదొడ్లు, పారిశుధ్య అంశాలు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం తదితర అంశాలను పరిశీలించి అక్కడికక్కడే అధికారులను నిలదీశారు. పారిశుధ్య కాంట్రాక్ట్‌లో లొసుగులను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు విభాగాల్లో ఫ్యాన్లు, ఏసీలు పని చేయకపోవడంపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మెరుగైన వైద్యం కోసం వచ్చే పేద రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

పారిశుధ్య కార్మికుల లొసుగులపై మండిపాటు

క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ వార్డులో ఐసీయూ బెడ్లు అవసరం మేరకు లేవని గమనించిన ఆయన వైద్యాధికారులను అడిగి 40 బెడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజూ పారిశుధ్య కార్మికులు 220 మంది ఉండాల్సి ఉండగా అందులో ఉదయం 120 మందికి గాను 89 మాత్రమే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాజువాలిటీ, ఎమర్జెన్సీ మెడికల్ వార్డుల్లో మరుగుదొడ్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, తలుపులు, మెష్ తదితరాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన అల్మారాలు 4, క్రష్ ట్రైలర్స్ రెండు కొనుగోలు చేయాలని సూచించారు. ఎమర్జెన్సీ వార్డ్ నందు పేషంట్లు ఉండే బెడ్‌కు నాలుగు వైపులా క్లోజ్ చేసేలా తెరలు ఉండాలని ఆదేశించారు.

పరీక్షల రిపోర్టులు అదేరోజు ఇవ్వాలి

ఎంఆర్ఐ సిటీ స్కాన్ రిపోర్టులు పరీక్షలు నిర్వహించిన రోజునే పేషెంట్లకు ఇవ్వాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే రోగుల సహాయకులు ఉండడానికి నిర్మాణంలో ఉన్న భవనాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులను ప్రశ్నించగా దాత నిధుల ద్వారా నిర్మాణం చేపట్టామని నిధుల కొరతతో ఆగిందని తెలుపగా పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను సమకూరుస్తామని, నెలలోపు భవనాన్ని పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డీఎంహెచ్ఓ బాలాజీ నాయక్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, సీఎస్ఆర్ఎంఓ సుబ్బలక్ష్మమ్మ, ఏసీఆర్ఎంఓ హరికృష్ణ, ఈఈ శివరామిరెడ్డి, హెచ్‌డీఎస్ సభ్యులు సందీప్, షేక్ ఖాజా మొహినుద్దీన్ పాల్గొన్నారు.

మందుల కొరతపై ఆరా..

అక్యూట్ మెడికల్ కేర్‌లో అవసరమయ్యే మందులను ఫార్మశీ సిబ్బంది, అడ్మినిస్ట్రేటర్ ముందస్తుగా గుర్తించి మందుల కొరత లేకుండా ఏపీ ఎంఎస్ఐడీసీ వారి వద్ద నుంచి సరఫరా లేని మందులను స్థానికంగా కొనుగోలు చేసి పేద రోగులకు ఇవ్వాలని సూచించారు. అందుబాటులో లేని మందులను జాబితా తయారు చేసి 24 గంటలలోపు మందుల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలక్ట్రోలైట్ పరీక్షలు రోగులకు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఆటో అనలైజర్ మిషన్ సమస్య ఉందని అధికారులు తెలుపగా సోమవారం నాటికి అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాడైన 3 సీరం ఎలక్ట్రోలైట్ టెస్టింగ్ మిషన్లను సత్వరమే అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఏజెన్సీని ఆదేశించారు.


జమియా మసీద్ ప్రారంభం



మసీద్ ప్రారంభోత్సవంలో సమన్వయకర్త నూకతోటి

వరదయ్యపాళెం: మండలంలోని ముస్లింపాళెంలో స్థానిక సర్పంచ్ మల్లాంగ్ అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన జమియా మసీద్‌ను శుక్రవారం ముస్లిం మతపెద్దల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్యఅతిథిగా పార్టీ శ్రేణులతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్, ముస్లిం మతపెద్దలు వారిని ఘనంగా స్వాగతించారు. ఇస్లాం ఆచారం మేరకు జరిగిన ప్రార్థనలో వారు పాల్గొన్నారు. అనంతరం వారి ఆచారం మేరకు అతిథులకు తలపై టోపీ ధరింపజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమియా మసీద్‌ను అద్భుతంగా నిర్మించారని, అందరూ భక్తిశ్రద్ధలతో మెలగాలని కోరారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, ఎంపీపీ భర్త దామోదర్‌రెడ్డి, మాజీ దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్ బాబు, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బందిల సురేష్, నియోజకవర్గ యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ దుద్దు వేణు, సీనియర్ నాయకులు చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, మైనారిటీ సెల్ నాయకులు అబ్దుల్, రసూల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పీజీసెట్‌ను రద్దు చేసి వర్సిటీలకే అప్పగించాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు

తిరుపతి సిటీ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యామండలి నిర్వహిస్తున్న పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్టును రద్దు చేసి, యూనివర్సిటీలే ప్రవేశ పరీక్షను నిర్వహించే అవకాశం కల్పించాలని విద్యార్థి సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఎస్వీయూ అన్నమయ్య భవన్ వద్ద విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ, జీఎస్ఎస్, నల్సా, బీసీ, ఎస్టీ ఎస్సీ సెల్, ఓబీసీ, జేబీఎస్ఎఫ్ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించడంతో విద్యార్థులకు సంబంధిత నోటిఫికేషన్ గురించి పూర్తి వివరాలు తెలియకపోతుండడంతో ఎంతోమంది ఉన్నతవిద్యకు దూరమవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్ష రద్దు చేయకపోతే యూనివర్సిటీల బంద్‌లకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జెన్నే మల్లికార్జున, జీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శివశంకర్ నాయక్, విద్యార్థి కార్మిక సంఘ నాయకుడు చిన్న, నల్సా వ్యవస్థాపకుడు సుందర్, ఓబీసీ సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు నాగేశ్వరావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, ఎస్టీ ఎస్సీసెల్ వ్యవస్థాపకుడు మురళి, నాయకులు అశోక్, ప్రవీణ్, చంద్ర నాయక్, ఓం రాజు, విజయ్, మహేంద్ర నాయక్, రెడ్డి మోహన్ పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు!



వెంకట భాగ్యలక్ష్మి

వాకాడు: మండల కేంద్రానికి చెందిన బొంతల వెంకట భాగ్యలక్ష్మి అనే వితంతు మహిళను అధికారులు బతికి ఉండగానే చంపేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వెంకట భాగ్యలక్ష్మిని గత ఎనిమిదేళ్లుగా బతికి ఉండగానే రికార్డుల్లో చనిపోయినట్లు నమోదు చేశారు. వెంకట భాగ్యలక్ష్మి భర్త వెంకటేశ్వర్లు ఇరవై ఏళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అప్పటి నుంచి ఆమె వితంతు పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకుంటూనే ఉంది. అయితే ఈమె కుమారుడికి అప్పట్లో సొంత కారు, వ్యాపారం ఉండడంతో పింక్ రేషన్ కార్డు ఉండడంతో ఆమెకు పింఛన్ రాలేదు. ఆ తరువాత కుమారుడు కుటుంబం నుంచి విడిపోయి వివాహం చేసుకుని వేరే రేషన్ కార్డుతో వేరే ప్రాంతంలో స్థిరపడ్డాడు. అప్పటి నుంచి ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చిన్న చిల్లర దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తుంది. పింఛన్ కోసం తన పింక్ రేషన్ కార్డును తెల్ల రేషన్ కార్డుగా మార్చుకోవాలని 8 ఏళ్లుగా సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతుంది. తీరా చూడబోతే పంచాయతీల రికార్డుల ప్రకారం ఈమె చనిపోయినట్లు నమోదై ఉంది. అప్పటి నుంచి ఈమె తన సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెబుతూనే కాలయాపన చేస్తున్నారు. అధికారులు చేసిన తప్పిదాల కారణంగా గత 8 ఏళ్లుగా పింఛన్ మంజూరు కాక నానా ఇబ్బందులు పడుతుంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాను బతికే ఉన్నానని గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని వెంకట భాగ్యలక్ష్మి ప్రాధేయపడుతుంది.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు ఆహ్వానం

- నేటి నుంచి 25 వరకు దరఖాస్తుల స్వీకరణ



ఆన్‌కాల్ డ్రైవర్ల భర్తీ చేయడానికి డీసీటీఎం, తిరుపతి డీఎంతో చర్చిస్తున్న డీపీటీవో నరసింహులు

డిపోల వారీగా భర్తీ చేయనున్న డ్రైవర్లు

డిపో	డ్రైవర్ల సంఖ్య
తిరుపతి	71
అలిపిరి	41
మంగళం	42
శ్రీకాళహస్తి	68
పుత్తూరు	41
సత్యవేడు	18
సూళ్లూరుపేట	21
గూడూరు	24
కోట	21
తిరుమల	45
వెంకటగిరి	26

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో అన్ని క్యాడర్లలో పలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం వాటిని భర్తీ చేయకుండా 8 నెలలుగా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తోంది. అదే పద్ధతిని డ్రైవర్ల విషయంలోనూ అనుసరిస్తోంది. తాజాగా 418 మంది ఆన్‌కాల్ డ్రైవర్లను (రోజు వారి భత్యంతో) తీసుకోవడానికి శనివారం నుంచి దరఖాస్తులను ఆహ్వానించనున్నట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఆ మేరకు శుక్రవారం జిల్లాలోని 11 డిపోలకు చెందిన మేనేజర్లకు సమాచారం ఇచ్చినట్టు వెల్లడించారు. గంటకు రూ.100 చొప్పున, రోజుకు 8 గంటల నుంచి 12 గంటల పాటు డ్యూటీ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ఆయా డిపోల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. 26 నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ, మార్చి 1 నుంచి డ్యూటీల కేటాయింపు చేయనున్నట్టు తెలిపారు.

అర్హతలు

హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు నిండి ఉండాలి. వయస్సు 45 ఏళ్ల లోపు ఉండాలి. జిల్లాకు చెందిన వారుగా ఉండాలి. ఆరోగ్యంగా ఉన్నట్లు మెడికల్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ సర్టిఫికేట్ జిరాక్స్‌ను దరఖాస్తులతో జతచేయాలి. ఆయా డిపోల పరిధిలోని డీఎం ఆఫీస్‌లో దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ వరకు సమర్పించవచ్చు.

శాశ్వత డ్రైవర్లకు మొండిచెయ్యేనా?

ఖాళీగా ఉన్న డ్రైవర్లను భర్తీ చేస్తే జీతాలు పెద్ద మొత్తంలో ఇవ్వాల్సి ఉంటుందని భావించిన కూటమి సర్కార్ గంటకు రూ.100 చొప్పున చెల్లించి ఆన్‌కాల్ డ్రైవర్లను భర్తీ చేయడానికి చర్యలు చేపడుతోంది. దీంతో శాశ్వత డ్రైవర్ల భర్తీకి మొండిచెయ్యి చూపుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

అన్ని డిపోల్లో అవసరం

"ఆన్‌కాల్ డ్రైవర్లకు పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు ఆయా డిపో మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంచాం. 400 మందికి పైగానే తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. వారికి శిక్షణ ఇచ్చిన తర్వాత మార్చి 1 నుంచే డ్యూటీ ఇస్తాం. గంటకు రూ.100 చొప్పున రోజుకు 8 గంటల నుంచి 12 గంటల వరకు డ్యూటీలు ఉంటాయి.

–నరసింహులు, డీపీటీఓ

మొండలెజ్ క్యాడ్బరీ పరిశ్రమలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ పోలీసులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామికవాడలోని మొండలెజ్ క్యాడ్బరీ పరిశ్రమలో శుక్రవారం శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచనల మేరకు పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా నియంత్రించాలి, క్యూఆర్‌టీ టీమ్ ద్వారా ప్రథమ చికిత్సకు తీసుకోవాల్సిన చర్యలపై శ్రీసిటీ సీఐ బీవీ శ్రీనివాసులు హితభోదన చేశారు. అలాగే గ్యాస్ లీకేజ్, అగ్ని ప్రమాదాలపై వారు వ్యవహరించాల్సిన విషయాల గురించి పలు సూచనలు చేశారు. ఆ మేరకు పరిశ్రమ కార్మికులు, ఉద్యోగుల సమక్షంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


గాయపడిన వలస కార్మికుడి మృతి



వలస కార్మికుడు సోనుమహ్మద్

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లిలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఇటీవల జరిగిన భారీ విస్ఫోటనంలో గాయపడిన వలస కార్మికుడు సోనుమహ్మద్(28) శుక్రవారం మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. జనవరి ఒకటో తేదీ రాత్రి స్టీల్ పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంలో ఆరుగురు వలస కార్మికులు గాయపడ్డారు. క్షతగాత్రులలో ఒకరు ప్రమాదం రోజే నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందగా మిగిలిన క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. చెన్నైలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోనుమహ్మద్ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సిట్ కస్టడీకి కల్తీ నెయ్యి కేసు నిందితులు



ఆస్పత్రిలో కల్తీ నెయ్యి కేసు నిందితులు

తిరుపతి తుడా: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసులో నిందితులను సిట్ కస్టడీలోకి తీసుకునేందుకు న్యాయస్థానం అనుమతి మంజూరు చేసింది. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ నిమిత్తం ప్రభుత్వం సిట్‌ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల రాజశేఖర్ పోమిల్ జైన్, అపూర్వ, విపిన్ జైన్‌ను సీబీఐ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను విచారించాలని సిట్ అధికారులు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఐదు రోజుల కస్టడీకి అనుమతి లభించింది. ఈ మేరకు ఆ నలుగురికి శుక్రవారం తిరుపతి రుయా ఆస్పత్రిలో వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రాథమిక పరీక్షల అనంతరం వారిని విచారణ నిమిత్తం సిట్ కస్టడీకి తీసుకెళ్లారు.

వేధింపులు తాళలేకున్నాం

వెంకటగిరి రూరల్: ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల్లో ఈఎంఐ వేధింపులు తాళలేకపోతున్నామని డక్కిలి మండలం సూరాయిపాళేనికి చెందిన షేక్ ఫాతిమా వాపోయారు. వెంకటగిరి పట్టణంలోని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు మాట్లాడారు. వెంకటగిరిలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో ఇంటిపై రూ.2.20 లక్షలు రుణం తీసుకున్నట్లు తెలిపారు. కొన్ని నెలల వరకు ఈఎంఐ క్రమం తప్పకుండా కట్టుకుంటూ వచ్చామని, అయితే ఇటీవల కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈఎంఐ చెల్లించకలేకపోయామని తెలిపారు. దీంతో ఫైనాన్స్ ప్రతినిధులు వేళాపాలాలేని సమయాల్లో ఫోన్‌కాల్స్ చేసి వేధించి తీవ్ర వేదనకు గురిచేశారన్నారు. అంతేగాకుండా తాము నివాసం ఉంటున్న ఇళ్లను జప్తుచేసి నోటీసు బోర్డు అంటించినట్లు వాపోయారు. ఈ ప్రైవేటు ఫైనాన్స్ ఆగడాలకు తన కుటుంబం వీధిన పడిందని, తమను ఆదుకోవాలని వేడుకుంది.